కుళాయి చెరువు గట్టు అభివృద్ధిపై నిర్లక్ష్యం

- అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారిన వైనం
- పట్టించుకోని మున్సిపాలిటీ

నరసాపురం: నరసాపురం పట్టణ నడిబొడ్డున 1వ వార్డు శ్రీహరిపేటలో ఉన్న కుళాయి చెరువు గట్టు అభివృద్ధిపై నిర్లక్ష్యం ఆవరించింది. ఫలితంగా రాత్రిపూట అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. వీటిపై మున్సిపల్, పోలీసు అధికారులు స్పందించడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గత ప్రభుత్వంలో అభివృద్ధికి నిర్ణయం

70 ఎకరాల భారీ విస్తీర్ణంలో ఉన్న కుళాయి చెరువుగట్టు చుట్టూ ఫెన్సింగ్ వేయడం, చెరువు ఆవరణలో అందమైన మొక్కలు పెంచి గ్రీ పార్కు తరహాలో అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ హయాంలో ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు నిర్ణయించారు. ఈ మేరకు కొంత పని కూడా జరిగింది. చెరువు గట్టు వద్ద జాతీయ జెండా భారీ బోర్డును అందంగా ఏర్పాటు చేశారు. 216 జాతీయ రహదారిపై వెళ్లేవారికి ఆ బోర్డు అందంగా కనిపించేది. నేడా బోర్డు శిథిలమవుతున్నా పట్టించుకోవడంలేదు. అలాగే చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మించాలని వైఎస్సార్ సీపీ హయాంలో నిర్ణయించారు. ఆ పనులు కూడా నిలిపోయాయి.



చెవురుగట్టు వద్ద శిథిలమైన జాతీయ జెండా బోర్డు

చెరువులోనే మద్యం బాటిళ్లు

కుళాయి చెరువు గట్టు చుట్టూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలు వాకింగ్ చేస్తారు. అయితే ఇటీవల రాత్రి పూట మందుబాబులు చేరి అక్కడే మద్యం సేవించడం, ఖాళీ బాటిళ్లు చెరువులోనే పడేస్తున్నారు. ఈ నీటినే ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రజలకు మున్సిపాలిటీ అందిస్తుంది. రాత్రి పూట వాటర్ వర్క్స్ కార్యాలయం వద్ద ఒకరు కాపలా ఉండాలి. ఆ విధులు ఎవరు నిర్వహిస్తున్నారనేది తెలియని విషయం. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టి చెరువు వద్ద అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేయాలని, చెరువు అభివృద్ధి పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

సాగునీరు అందక ఇబ్బందులు



స్వచ్ఛందంగా పంట బోదెను బాగుచేస్తున్న రైతులు

నరసాపురం రూరల్: మండలంలోని శివారు ప్రాంత భూములకు సాగునీరు అందక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట బోదెల్లో తూడు పేరుకుపోయి నీటి పారుదలకు ఆటంకంగా మారింది. బుధవారం ఎల్బీచర్ల గ్రామంలో 21.18 పంట బోదెను రైతులు స్వచ్ఛందంగా బాగుచేసుకున్నారు. చివారు ప్రాంత పొలాలకు సాగు నీరు అందించాలని వైఎస్సార్ సీపీ ఎల్బీచర్ల గ్రామ అధ్యక్షుడు, పంచాయతీ వార్డు మెంబరు బొడ్డు ఆశీష్ కుమార్ అధికారులను కోరారు.

దోమల నివారణ చర్యలు



యాళ్లవానిగరువులో దోమల నివారణ మందు స్ప్రే చేయిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: దోమల నివారణకు పాలకొల్లు రూరల్ యాళ్లవానిగరువులో ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ప్రత్యేకాధికారి, ఈవోపీఆర్‌డీ తాళ్ల మూర్తిబాబు తెలిపారు. బుధవారం ఫాగింగ్ మెషీన్‌ను ఆయన ప్రారంభించారు. దీని ద్వారా మిలాథిన్ మందుని పిచికారీ చేయించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సీహెచ్ సత్తిబాబు, గ్రామ పెద్దలు పాముల రజనీకుమార్, సచివాలయ ఉద్యోగులు సరళా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

దళితనేత శ్రీధర్‌కు పరామర్శ



శాంతమ్మకు నివాళులర్పిస్తున్న ముదునూరి

నరసాపురం: పట్టణంలోని 31వ వార్డు జవదాలపేటకు చెందిన దళితనేత సోడదాసి శ్రీధర్ తల్లి శాంతమ్మ ఇటీవల మృతి చెందారు. శ్రీధర్ కుటుంబ సభ్యులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఉంగరాల రమేష్‌నాయుడు, నల్లిమిల్లి జోసఫ్, ఇంజేటి జాన్‌కెనడీ, కాకిలేటి ఆనంద్, దొంగ మురళి, గమిడి మధుబాబు, వర్ధనపు ఏసురత్నం తదితరులు ఉన్నారు.

చిరుపొట్ట దశలో ఎరువులు వేయాలి



తిల్లపూడిలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ రాజశేఖర్

పాలకొల్లు అర్బన్: వరి చిరుపొట్ట దశలో యూరియా, పొటాష్ ఎరువులు వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ సూచించారు. మండలంలోని తిల్లపూడి, శివదేవునిచిక్కాల గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు సూచనలు చేశారు. దాళ్వాలో మూడు కోటాలు కాంప్లెక్స్ ఎరువులు వేయడం వల్ల ఖర్చులు పెరుగుతాయన్నారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు నడపన శ్రీనివాసరావు, దిడ్ల మణివజ్రం, నీటి సంఘం అధ్యక్షుడు ఇంటి శ్రీరాముడు, బోడపాటి కాశి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో కేసు రాజీ

నరసాపురం రూరల్: రాజీ పడదగిన అన్ని కేసులనూ జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పారాలీగల్ వలంటీర్ డి.వరలక్ష్మి తెలిపారు. వచ్చేనెల 8వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌కు సంబంధించిన పత్రాలను బుధవారం ఆమె మొగల్తూరు మండలంలోని పలు సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అందజేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

ఏఐ టెక్నాలజీతో భవిష్యత్తు

పాలకొల్లు అర్బన్: ఆర్టిఫిషియల్ టెక్నాలజీ (ఏఐ టెక్నాలజీ)లో మంచి నైపుణ్యతను సాధించి భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ (రాజమహేంద్రవరం) ప్రొఫెసర్ బి.జగన్మోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక బీవీఆర్ అండ్ జీకేఆర్ డిగ్రీ, పీజీ కళాశాలలో డిగ్రీ ఆఖరి సంవత్సరం విద్యార్థులకు బుధవారం కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డి.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు విజయలక్ష్మి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు జానకిరామయ్య, టి.మీనా, విద్యార్థులు పాల్గొన్నారు.

వంతుల వారీగా నీరు విడుదల

నరసాపురం రూరల్: వంతుల వారీగా విడుదల చేసే సాగు నీటిని సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఇరిగేషన్ డీఈ వెంకట నారాయణ రైతులకు సూచించారు. బుధవారం ఆయన మొగల్తూరు ప్రధాన కాలువను పరిశీలించారు. నరసాపురం కాలువ నుంచి పెరవలి లాకు, కవిటం, జిన్నూరు, నవుడూరు గర్వు, శేరేపాలెం, కొత్తపాలెం వరకు 2082 ఎకరాలకు 7వ తేదీ వరకు, 14 నుంచి 20 వరకు, 27 నుంచి మార్చి 5 వరకు, 12 నుంచి 18 వరకు, 25 నుంచి 31 వరకు సాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. రెండో విడత కవిటం లాకు నుంచి మొగల్తూరు లాకు వరకు మొగల్తూరు, కేపీపాలెం, పేరుపాలెం, రామన్నపాలెం గ్రామాల్లోని 7238 ఎకరాలకు ఈనెల 7వ తేదీ నుంచి 13 వరకు, 20 నుంచి 26 వరక, మార్చి 5 నుంచి 11 వరకు, 18 నుంచి 24 వరకు, 31 నుంచి ఏప్రియల్ 4 వరకు సాగు నీరు విడుదల చేస్తామన్నారు.

నేటి నుంచి వాసవీ శాంతి ధాంలో వార్షికోత్సవాలు

పెనుగొండ: స్థానిక వాసవీ శాంతి ధాంలో వాసవీ కన్యక పరమేశ్వరి 90 అడుగుల పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ ఆరో వార్షికోత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్టు అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ అధ్యక్షుడు పీఎన్ గోవిందరాజులు తెలిపారు. బుధవారం స్థానిక వాసవీ శాంతి ధాంలో ఆయన మాట్లాడారు. గురువారం ధ్వజారోహణం, గోమాత పూజతో వార్షికోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 7న వార్షికోత్సవం సందర్భంగా పూజలు, హోమాల అనంతరం వాసవీ మాతకు అమెరికన్ డైమండ్స్‌తో పొదిగిన వజ్రాంగితో అలకంరిస్తారని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పీఠాధిపతులు రానున్నట్టు చెప్పారు. సాయంత్రం వెండిరథం, కలసాలతో ఊరేగింపు, అష్టాదశ హారతులు ఉంటాయని వివరించారు.



శింగోలును వివరిస్తున్న ట్రస్ట్ అధ్యక్షుడు గోవిందరాజులు

క్షేత్ర పీఠాధిపతిగా బాలా స్వామి

పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా తెనాలికి చెందిన ప్రజ్ఞానంద సర స్వతీ స్వామి (బాలా స్వామి) నియమితులయ్యారని, వీరికి 8వ తేదీన పట్టాభిషేకం చేయనున్నట్టు తెలిపారు. 16 ఏళ్ల పాటు క్షేత్ర పీఠాధిపతిగా ఉన్న కృష్ణనంద పురి స్వామిజీ గతేడాది శివైక్యం పొందారని గుర్తుచేశారు. బాలాస్వామిజీకి శింగోలు సమర్పిస్తామన్నారు. బాలా స్వామిజీ పర్యవేక్షణలో ఈ ఏడాది వేద పాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు. సర్వ ధర్మసమన్వయిగా వాసవీ కనక్య పరమేశ్వరి అన్ని వర్గాలకు ఆదర్శ ప్రాయురాలిగా నిలిచిందన్నారు. వాసవీ శాంతి ధాం అభివృద్ధికి సహకరింస్తున్న ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ట్రస్ట్ ఈసీ సభ్యులు ఉమా గోవిందరాజులు, చిన్ని రమా సత్యనారాయణ, కె.రజని, మద్దుల సత్య కుమార్, నున్న శ్రీనివాస్, బొడ్డు శ్రీనివాస్, సీహెచ్ సాహితి, మండ పద్మావతి, సింహాద్రి పద్మ, పొన్న గంటి సత్యకోటేశ్వరిలు పాల్గొన్నారు.

మద్యం షాపుల దరఖాస్తు గడువు పెంపు

పాలకొల్లు అర్బన్: గీత కులాల మద్యం షాపుల కోసం ఈ నెల 8న సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పాలకొల్లు సర్కిల్ ఎక్సైజ్ సీఐ మద్దాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10న ఉదయం 10 గంటలకు భీమవరం కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ తీయనున్నట్టు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94409 02437లో సంప్రదించాలని తెలిపారు.

పదోన్నతిపై బదిలీ

పెనుగొండ: విద్యుత్ శాఖ పెనుగొండ సబ్ డివిజన్ ఏడీఈ కె.రాంబాబు ఈఈగా పదోన్నతి పొందారు. కోనసీమ జిల్లా అమలాపురం సర్కిల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా రాంబాబును పలువురు అభినందించారు. బుధవారం ఆయన పెనుగొండ నుంచి రిలీవ్ అయ్యారు.

లక్ష్మీగణపతికి విశేష పూజలు



లక్ష్మీగణపతి

పెనుమంట్ర: స్థానిక మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీలక్ష్మీగణపతి స్వామి ఆలయం ఐదో వార్షికోత్సవం సందర్భంగా బుధవారం స్వామివారికి ఉదయం విశేష పూజలు, మధ్యాహ్నం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో స్వామివారికి మహా రుద్రాభిషేకం, గణపతి హోమం అనంతరం ప్రసాదాన్ని వితరణ చేశారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక రథంపై ఉంచి మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

విద్యార్థుల రక్తదానం

పాలకొల్లు అర్బన్: స్థానిక శ్రీఏఎస్ఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, హెల్త్ కేర్ సెంటర్, ఆర్ఆర్‌సీ, జేసీఐ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మానసిక ఆరోగ్యం, మానసిక ఒత్తిడిపై అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలు చేశారు. కళాశాల విద్యార్థులు 20 మంది రక్తదానం చేశారు. రక్తదాతలకు ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి ప్రశంసాపత్రాలు అందజేశారు. లయన్స్ క్లబ్ రూరల్ అధ్యక్షుడు ఎస్ సుబ్బారావు, జోనల్ ఆఫీసర్, రిటైర్డు ప్రిన్సిపాల్ ఎస్వీ రంగారావు, విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, జేసీఐ అధ్యక్షుడు వి.వేణుగోపాల్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ కె భద్రాచలం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎం రామకృష్ణ, వి.విజయలక్ష్మి, హెల్త్ క్లబ్ కన్వీనర్ పి జ్యోత్స్నశ్రీ పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

ఆడపిల్ల చదువుతో వెలుగు

పాలకొల్లు అర్బన్: ఆడపిల్ల చదువుకుంటే కటుంబానికి వెలుగు నిస్తుందని సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. పాలకొల్లు మండలం శివదేవునిచిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా విద్యార్థినులతో నిర్వహించిన సైకిల్ ర్యాలీని ఇందిర ప్రారంభించారు. ఆడపిల్లలు ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. ఆడపిల్లలకు చిన్న వయస్సులో వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. హెచ్ఎం పి.రాము, సూపర్‌వైజర్ ఎస్ మంగ, ఉపాధ్యాయులు వీఎస్ఎన్ మూర్తి, ఏఎన్ఎం కె.రత్నం, అంగన్‌వాడీ వర్కర్లు కె.సత్యశ్రీ, విజయ, కుసుమ, ఆశవర్కర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



శివదేవునిచిక్కాలలో సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీడీపీఓ ఇందిర

వ్యాపార అంశాలపై అవగాహన ఉండాలి

పాలకొల్లు అర్బన్: మార్కెట్లో డిమాండ్ ఉన్న వ్యాపార అంశాలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పూర్తి అవాహన ఉండాలని జిల్లా లీడ్ మేనేజర్ నాగేంద్రప్రసాద్ అన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాలలో శ్రీ రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ తరగతులు బుధవారంతో ముగిశాయి. శిక్షణలో నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రాజెక్టు రిపోర్టు తయారీ, మార్కెట్ మెలకువలు, నిర్వహణ శక్తి సామర్థ్యం, ఖాతా పుస్తకాల నిర్వహణ, వ్యాపారంలో పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రైనర్ ఎంఎల్ కిషోర్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాసాచార్యులు, శ్రీరాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నిమ్మల నాగేశ్వరరావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకమాన్ తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న లీడ్ జిల్లా మేనేజర్ నాగేంద్రప్రసాద్

ప్రజల పక్షాన ముందుకు సాగాలి

ఉండి: వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పీవీఆర్‌కే అంజనేయరాజు ఆపార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడ క్యాంపు కార్యాలయంలో మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉండిలో బుధవారం ఆయన మాట్లాడుతూ పార్టీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజల యోగక్షేమాలను ఆయన అడిగినట్టు చెప్పారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఎలా ఉన్నారంటూ కుశల ప్రశ్నలు వేశారని తెలిపారు. ప్రజలకు చేసిన మంచి మనకు ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజాపక్షంగా ముందుకు సాగాలని సూచించారని వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు మంచి చేశామని తమనకు మళ్లీ మంచి జరుగుతుందని తెలిపారన్నారు. కార్యకర్తలు, నాయకులు, ప్రజలు మీకోసం ఎదురు చూస్తున్నారని ఉండికి రావాలని కోరినట్లు తెలిపారు. పాతూరి జనార్ధనరాజు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారని తెలిపారు.



వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌తో ఆంజనేయరాజు

నగర పంచాయతీ ముట్టడి

ఆకివీడు: తమకు ఏ విధమైన నోటీసులు ఇవ్వకుండా విద్యుత్ కనెక్షన్లు తీసి వేసి తమ జీవితాలను అంధకారంలోకి నెట్టారని ధర్మాపుర అగ్రహారంలోని మంచినీటి చెరువు ఆక్రమణదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం రాత్రి నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎయిమ్ (అంబేడ్కర్ ఇండియన్ మిషన్) ఆధ్వర్యంలో బాధితులు తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆందోళనకు దిగారు. కమిషనర్ అప్పటికే కార్యాలయం నుంచి వెళ్లిపోయారని, లోపలికి ఎవరూ వెళ్లొద్దని మేనేజర్, సిబ్బంది కార్యాలయానికి తాళం వేశారు. అయితే కమిషనర్ కార్యాలయంలోనే ఉన్నారని, ఆయన వచ్చి కరెంట్ ఎందుకు నిలుపుదల చేయించారో చెప్పాలని, తమ ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రాత్రి తొమ్మిది గంటల వరకూ వారి నిరసన కొనసాగుతూనే ఉంది.



కార్యాలయాన్ని ముట్టడించిన ఆక్రమణదారులు

హక్కులను కాలరాస్తున్న కేంద్రం



నరసాపురం : అంబేడ్కర్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న దృశ్యం



పాలకొల్లు అర్బన్ : గాంధీబొమ్మల సెంటర్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

నరసాపురం: ఉద్యోగులు, కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ విమర్శించారు. కేంద్రం ఇటీవల అమల్లోకి తీసుకొచ్చిన లేబర్‌కోడ్‌లను వ్యతిరేకిస్తూ బుధవారం అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మోదీ సర్కార్ కార్పొరేట్ శక్తులకు ఎర్రతివాచీలు పరుస్తూ, కార్మికుల పట్ల వివక్షత ప్రదర్శిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

లేబర్ కోడ్‌లతో భద్రత కరువు

పెనుగొండ : లేబర్ కోడ్ వల్ల కార్మికుల ప్రాణానికి భద్రత లేకుండా పోతుందని సీపీఎం మండల కార్యదర్శి పి.మోహన్‌రావు అన్నారు. ఆచంట సీఐటీయూ కార్యాలయం నుంచి కార్మికులు ర్యాలీగా కచేరి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ నిరసన వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు.

- పెనుగొండ గాంధీ బొమ్మల సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రామికులపై మోదీ ప్రభుత్వం యుద్ధం చేస్తోందని విమర్శించారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

పాలకొల్లు అర్బన్: లేబర్ కోడ్‌లు రద్దుచేసి కార్మిక చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ డిమాండ్ చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయం నుంచి గాంధీబొమ్మల సెంటర్ వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్స్‌ను రద్దుచేయాలి

పెనుమంట్ర: కేంద్రం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక లేబర్ కోడులను చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పెనుమంట్ర చిన్న వంతెన నుంచి బ్రాహ్మణ చెర్వు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కేతా గోపాలన్ మాట్లాడుతూ ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను సంపన్న వర్గాలు ప్రయోజనాల కోసం కార్మికుల పొట్ట కొట్టడం దుర్మార్గమని అన్నారు.

మెషీన్లతో కోత.. పశుగ్రాసానికి కొరత



వరి కోస్తున్న యంత్రం



మెషీన్లతో కోసిన గడ్డి కట్టలు

- అధిక రేట్లకు గడ్డి కొనుగోలు
- పాడి రైతుల ఆవేదన

యలమంచిలి: యంత్రాలతో వరి కోతలు కోస్తుండటంతో పశుగ్రాసం కొరత ఏర్పడింది. దీంతో మూగజీవాలు ఆకలితో అలమటిస్తున్నాయి. పశువులను పెంచుకోవడానికి రైతులే తిరిగి పశుగ్రాసం కొనుగోలు చేయాల్సి వస్తుంది. పశుగ్రాసం కొరతతో కొందరు రైతులు పశువులను పెంచలేక విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలోని పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 34,822 ఎకరాల్లో వరి సాగు చేశారు. కూలీల కొరత, వేతనం ఖర్చు ఎక్కువగా ఉండటంతో యంత్రాలతో వరి పంట మాసూలు చేస్తున్నామని రైతులు చెబుతున్నారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఎకరాకు 40 నుంచి 45 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. పంట బాగున్నప్పటికీ యంత్రాలతోనే కోయాల్సి వస్తుందని, మిషన్ ద్వారా కోత కోసి ధాన్యాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ఎకరాకు రూ.5,000 వరకు ఖర్చు అవుతుంది. వరి కోతలు పూర్తయిన వెంటనే పొలాల్లోనే గడ్డికి నిప్పుపెట్టి బూడిద చేస్తున్నారు. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడుతుంది.

వరి కోతలు ఖర్చుతో పని

కూలీలతో వరి కోతలు కోయించడం ఖర్చుతో కూడిన పని. కూలీల కొరతతో పాటు వేతనం కూడా ఎక్కువ. అంతేకాక పొలం దూరాన్ని బట్టి కూలీలు రేటు డిమాండ్ చేస్తున్నారు. చేలో వరి కోసిన తరువాత ఆరబెట్టిన పనలను కట్టేత కట్టి, ధాన్యాన్ని నూర్చడానికి దూరాన్ని బట్టి సుమారు రూ.9 వేలు నుంచి రూ.15 వేల వరకు ఎకరానికి ఖర్చు అవుతుంది. దీంతో వరి గడ్డిని రైతులు అధిక ధరలకు విక్రయించాల్సి వస్తుంది.

వర్షానికి తడిస్తే ఇబ్బంది



యంత్రాలతో కోసిన వరి గడ్డి తడిస్తేనే ఇబ్బంది. తడవకపోతే ఎటువంటి ఇబ్బందులు ఉండవు. యంత్రాలతో కోసిన గడ్డిని కుప్పగా ఉంచే యంత్రాలు సైతం అందుబాటులో ఉన్నాయి. 99 శాతం రైతులు యంత్రాలతో కోసేందుకు మక్కువ చూపుతున్నారు. ఎకరాకు 30 కట్టలకు పైగా వస్తాయి. యంత్రాలతో కోసినా ఎటువంటి ఇబ్బందులు ఉండవు. వాటిలో పోషక విలువలు ఏ మాత్రం తగ్గవు.

– పోరెడ్డి చంద్రశేకరరెడ్డి, పశు వైద్యాధికారి

రేషన్ వాహనాల తనిఖీ

పాలకోడేరు: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు పాలకోడేరు మండల తహసీల్దార్ భారతీ విజయలక్ష్మి గొల్లలకోడేరులోని రేషన్ పంపిణి చేసే వాహనాన్ని, రేషన్ షాపును తనిఖీ చేశారు. పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ ఆది శేషయ్య మొగల్లు, పాలకోడేరులో రెండు రేషన్ వాహనాలను, నాలుగు రేషన్ షాపులను బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్డుదారులను ఎలా పంపిణీ చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. సరుకుల రికార్డులను పరిశీలించారు. వీరి వెంట మాణిక్యాలరావు, సిబ్బంది ఉన్నారు.



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్

సీపీఎం రాష్ట్ర కమిటీలో ఇద్దరు జిల్లా వాసులు

భీమవరం: సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా పాలకోడేరు మండలం మొగల్లుకు చెందిన బి.బలరాం, భీమవరం పట్టణానికి చెందిన జేఎన్వీ గోపాలన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఈ నెల 1 నుంచి మూడు రోజుల పాటు నెల్లూరులో నిర్వహించిన సీపీఎం మహా సభల్లో ఎంపిక చేసినట్లు సీపీఎం కార్యాలయం బుధవారం తెలిపింది. సీపీఎం జిల్లా మాజీ కార్యదర్శి బలరాం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడిగా, ప్రస్తుతం జిల్లా కార్యదర్శిగా పని చేస్తున్న గోపాలన్ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.